

బడి తరువాత విద్యా బోధన ప్రారంభం

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్లాన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బడి తరువాత విద్యా బోధన కార్యక్రమాన్ని సర్పంచ్ భరత్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా 2011 నుంచి జిల్లాలో 8 సెంటర్లలో ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు బడి తరువాత విద్య బోధన కార్యక్రమాన్ని నిర్వహించి ఉచిత విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించి బహుమతులను అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఆ దిశగా సంస్థ విద్యాభివృద్ధి కోసం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గౌరవ అధ్యక్షులు కారుమంచి గణేష్ అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజా చంద్రరావు, సంస్థ ప్రతినిధులు ఎస్.వెంకటరావు, ఎస్.కె.షరీఫ్, దూళిపూడి రవీంద్ర, కొంపెల్లి బాబూరావు, సతీష్, బేతాల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియా...

- ప్రయివేటు ఆస్పత్రులతో కొందరు ఆర్ఎంపిల కుమ్మక్కు
- 40 శాతం వరకూ కమీషన్లు దండుకుంటున్న వైనం
- పరీక్షల పేరుతో రోగుల జేబులకు చిల్లులు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పల్లెలు, పట్టణాల్లో మెడికల్ మాఫియా పెచ్చరిల్లుతోంది. ప్రథమ చికిత్సలు చేసి గతంలో రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడిన ఆర్ఎంపి వైద్యులు ప్రస్తుతం కొందరు ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా మారుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజల అనారోగ్యమే అవకాశంగా మార్చుకుని గ్రామాల్లో కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్న విషయం విదితమే. పట్టణాల్లోని ప్రయివేట్ ఆస్పత్రులంటేనే ప్రజల్లో భయం నెలకొంటుంది. వివిధ రకాల పరీక్షలు చేయించి రూ.వేలల్లో వసూలు చేయటమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో తగ్గిపోతుందనే ఆశతో అత్యధిక మంది స్థానిక వైద్యులను ఆశ్రయిస్తున్నారు. కొందరు బాధ్యతగా వ్యవహరిస్తూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు. మరికొందరు రోగులకు తమ పరిధిలో లేని వైద్యం కూడా చేస్తూ ధనార్జనే ధ్యేయంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పట్టణాల్లోని ప్రయివేట్ ఆస్పత్రులతో ఒప్పందాలు కుదుర్చుకుని పరీక్షలు చేయిస్తున్నారు. రోగుల ప్రాణం మీదికి వచ్చినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ వైద్య మాఫియాకు, రోగులకు మధ్య ఆర్ఎంపిలు వారధిగా మారుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్

ఆర్ఎంపి వైద్యులు రోగులకు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. దీనికి భిన్నంగా అత్యవసర సేవలతో మొదలై దీర్ఘకాలిక జబ్బులకు సైతం వైద్యం చేస్తున్నారు. ఫార్మా కంపెనీలు ఇచ్చే బహుమతులకు అలవాటు పడి యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ రోగులకు ఇస్తున్నట్లు సమాచారం. ఫలితంగా కొన్ని సార్లు రోగుల ప్రాణాల మీదకు తీసుకువస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఆర్ఎంపిల విద్యార్హతలను పరిశీలిస్తే వారిలో చాలామందికి కనీస వైద్య పరిజ్ఞానం లేకపోవడం, వైద్య పరిభాష తెలియని వారు ఉండటం విశేషం. కానీ వీరంతా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఒకప్పుడు ఆర్ఎంపిలు ప్రథమ చికిత్సా కేంద్రం అని బోర్డు తగిలించుకుని వైద్యం చేసేవారు. ఇపుడు క్లినిక్, ఆస్పత్రి అంటూ బోర్డు పెట్టుకుంటున్నారు. జిల్లాలో జనాభాకు తగ్గట్టు వైద్యులు లేకపోవడంతో వైద్య వృత్తికి డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇబ్బడి ముబ్బడిగా ఆర్ఎంపిలు క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పల్లెల నుంచి పట్టణాలకు దూర ప్రయాణం చేయడానికి ఓపిక లేక కొందరు... ప్రయివేటు ఆస్పత్రులంటే బిల్లుల భయంతో ఇంకొందరు ఊళ్లో అందుబాటులో ఉండే ఆర్ఎంపిలను ఆశ్రయించి నష్టపోతున్నారు.

ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా...

ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఓ నలుగురు పిఆర్ఒలను నియమించుకుని ఆర్ఎంపిలను కలిసేలా లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. పిఆర్ఒలు ఊరూరా తిరిగి గ్రామాల్లో ఉండే ఆర్ఎంపిలను కలిసి రోగులను తమ ఆస్పత్రులకు పంపేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఆ విధంగా రోగులను రిఫర్ చేసినందుకు బిల్లుల్లో 30 నుంచి 40 శాతం ఆర్ఎంపిలకు కమిషన్లను చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆర్ఎంపిలు అవసరం ఉన్నా లేకపోయినా తమ వద్దకు వచ్చే రోగులను పట్టణాల్లోని ఆస్పత్రులకు పంపించడం అనవాయితీగా మారింది. రోజు రోజుకీ ఆర్ఎంపిలు తీరు ధనార్జనే ధ్యేయంగా మారుతోంది. వైద్యా శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఈ దోపిడీకి అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్ భరత్

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

-స్పందనలో జిల్లా కలెక్టర్ మాధవీలత ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్పందనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి అధికారులందరూ శాఖాపరంగా వచ్చిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించే బాధ్యత తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం స్పందనకు విచ్చేసిన దివ్యాంగుల వద్దకే కలెక్టర్ వెళ్లి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. స్పందనలో మొత్తం175 అర్జీలను స్వీకరించగా ఇందులో ఆన్‌లైన్ ద్వారా148, ఆఫ్‌లైన్ ద్వారా 27 ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరశింహులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పులుగుర్తకు కేంద్ర బృందం రాక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అనపర్తి మండలం పులుగుర్తలో కాటన్ ఫ్యాబ్రిక్స్‌ను కేంద్ర బృందం పరిశీలించనుందని జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒక జిల్లా ఒక ఉత్పత్తికి ప్రోత్సాహం అందించే నేపథ్యంలో జిల్లా లోని పులుగుర్త కాటన్ ఫ్యాబ్రిక్స్‌ను ప్రతి పాదించడం జరిగిందని, ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో మల్కా, పులుగుర్త కాటన్ ఫాబ్రిక్ యొక్క సొంత సాంస్కృతిక ప్రాముఖ్యత, ప్రత్యేకమైన హస్తకళ, మార్కెట్ సామర్థ్యాన్ని పరిశీలించేందుకు కేంద్ర బంద పరిశీలకులు ఇన్వెస్టు ఇండియా టీమ్ ప్రతినిధి హరప్రీత్ సింగ్ రానున్నారని తెలిపారు. గత 35 ఏళ్ల నుంచి ఒక్క ఏడాది మినహా నిరంతరంగా లాభాలను ఆర్జించే సొసైటీగా గుర్తించబడి సర్టిఫికేట్ 'ఎ' క్లాస్‌తో ఆడిట్ చేయబడిందన్నారు. పులుగుర్త చేనేత చేనేత సహకార సంఘం సుమారు 300 మందికి చేనేత, దాని అనుబంధ కార్యకలాపాలలో ఉపాధి కల్పిస్తోందని వివరించారు. జాతీయ చేనేత అభివద్ధి కార్యక్రమం కింద ఈ సొసైటీకి ప్రాజెక్ట్ వ్యయం రూ.120.50 లక్షలతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంజూరు చేశారన్నారు. స్థిరమైన, పర్యావరణ అనుకూల వస్త్ర ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, సాంప్రదాయ కళాకారులు మరియు డిజైనర్లను కలిగి ఉన్న వికేంద్రీకృత విధానానికి ఈ బృందం సిఫార్సులు మేరకు ఎంపిక చేస్తారని తెలిపారు.

జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - రాజానగరం

మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తోకాడ జడ్‌పి ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. జిఎస్ఎల్, జూపిటర్ ఆసుపత్రి యాజమాన్యాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 12 విభాగాలకు సంబంధించిన 40 మంది వైద్యులు పాల్గొని సుమారు 650 మందికి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు జక్కంపూడి రాజశ్రీ మాట్లాడుతూ దివంగత జక్కంపూడి రామ్మోహన రావు ఆశయం కోసం తమ కుటుంబం అంతా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేగిశెట్టి పోతురాజు, ఎంపిటిసి గండి వెంకట సుజాత, వైకాపా నాయకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు

పేద విద్యార్థికి 'ఆదిమూలం' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వీరవరం గ్రామానికి చెందిన షేక్ బషీర్ రఫీ యుద్దీన్ సాహెబ్ (రఫీ) అనే పేద విద్యార్థి చదువు నిమిత్తం సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ సంస్థ అధ్యక్షులు ఆదిమూలం సాయిబాబా రూ.25 వేల ఆర్థిక సహాయం చేశారు రఫీ నన్నయ యూనివర్సిటీలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఇతను పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ లలో 9.7 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం సాయిబాబా, ప్రొఫెసర్ గోపాలకృష్ణ, ఎర్ర కృష్ణబాబు, సదాశివుని సురేష్ కుమార్, ఏరుకొండ వెంకటేష్, తల్లాప్రగడ రాజేశ్వరరావు, సుదర్శన్ లక్ష్మణరావు, వరుణ్, సత్యవతి, విన్నీ, సాయిశ్రీ, నాగలక్ష్మి, చక్రధర్, వ్యాగ్రే తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదును అందిస్తున్న సాయిబాబా

సూర్యప్రకాశరావుకు ఘన సత్కారం



సత్కారాన్ని అందుకుంటున్న దంపతులు

ప్రజాశక్తి - దేవరపల్లి


ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బండి సూర్య ప్రకాశరావును అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మండల శాఖ సమావేశం పప్పు వెంకట రామారావు అధ్యక్షతన సోమవారం జరిగింది. రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తున్న బండి సూర్య ప్రకాశ రావు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేశిరాజు సీతారామయ్య, కేసిరాజు రాజ్‌కుమార్, కోస్టల్ ఏరియా బ్యాంకు మేనేజర్ కేత శ్రీనివాస్, ఈడుపుగంటి నాగేశ్వరరావు, వి. శేషమణి పాల్గొన్నారు.

చివటంలో అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం గ్రామంలో సోమవారం బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. చవితి వేడుకల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.గణపతి, ఇ.దుర్గారావు, పి.పండు, తదితరులు పాల్గొన్నారు.. .

కార్టూ'నిజం'



లైంగిక వేధింపులపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - పెరవలి



విచారణ చేస్తున్న ఆర్‌డిఒ మల్లిబాబు

మండలంలోని కానూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలను లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు సిహెచ్ గంగరాజుపై ఆర్‌డిఒ మల్లిబాబు సోమవారం విచారణ నిర్వహించారు. సోమవారం ఉదయం బిఎస్‌పి ఆధ్వర్యంలో విద్యార్థినీల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌ను స్పందన కార్యక్రమంలో కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్‌డిఒ సోమవారం సాయంత్రం సంబంధిత పాఠశాలను సందర్శించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడి పనితీరుపై తోటి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో ఆరో పణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు, పాఠశాల విద్యార్థినీలు లేకపోవడంతో మరోసారి పాఠశాలను సందర్శించి విచారణ చేస్తానని ఆర్‌డిఒ వెల్లడించారు. ఈ విచారణలో తహశీల్దార్ టి.రాజేశ్వరి, ఎంఇఒ బి.స్వరూప్, సర్పంచ్ భావన మధు పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - గోపాలపురం



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హెచ్‌ఎం సిస్టర్ సిల్వి ఆంటోని అన్నారు. స్థానికంగా సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రథమ స్థానంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని మండల స్థాయిలో నిర్వహించిన పోటీలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విష్ణు, జ్యోత్స్న శ్రీ, గౌతమ్ అత్యున్నతమైన ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని బహుమతులు పొందినట్లు ఆంటోనీ తెలిపారు. విద్యార్థులు సాంకేత పరిజ్ఞానంపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వెంకటరత్నం, నాగేంద్రలను మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ ఎల్సి జార్జి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి - గోకవరం



నిరసన వ్యక్తం చేస్తున్న చిరువ్యాపారులు

సంత మార్కెట్ వేలం వద్దు- చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దని సంత మార్కెట్ వ్యాపారస్తులు నిరసన చేపట్టారు. సోమవారం మండల కేంద్రమైన గోకవరంలో జరిగిన నిరసనలో చిరువ్యాపారులు మాట్లాడుతూ దశబ్దాల తరబడి ఇదే మార్కెట్‌లో చిన్న చిన్న వ్యాపారాలు సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గ్రామపంచాయతీ అధికారులు మార్కెట్ ఆధునీకరణ పేరుతో ఉన్న షెడ్లను తొలగించి దాని స్థానే షాపులను నిర్మించారన్నారు. ఆయా షాపులకు సంబంధించి వ్యాపారస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వేలం నిర్వహించేందుకు అధికారులు సిద్ధపడ్డారని, దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఒక్కో షాపునకు రూ.2 లక్షలు చెల్లించాలంటే చిరువ్యాపారులకు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దశబ్దాల తరబడి ఆశీలు కుడుతూనే ఉన్నామని, ఏకపక్షంగా నేడు షాపునకు రూ.2 లక్షలు చెల్లించాలని నిర్ణయించడం దారుణమన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చిరువ్యాపారులు ఏవిధమైన రుసుం లేకుండా వ్యాపారం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు అనుమతి ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్తామని చెప్పారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన షాపులకు సంబంధించి గత వారం రోజులుగా మైక్ ద్వారా ప్రచారం చేయించడం జరిగిందని, త్వరలోనే వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

నాలుగో వసంతంలోకి ...

'స్వర్ణాంధ్ర' ఉచిత మొబైల్ అన్నదాన సేవ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



అవసరార్థులకు అన్నదానం చేస్తున్న స్వర్ణాంధ్ర నిర్వాహకులు

స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ అన్నదాన సేవా కార్యక్రమం మూడేళ్ళు పూర్తి చేసుకుని నాలుగో వసంతంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా సోమవారం పుష్కర ఘాట్ వద్ద జరిగిన అన్నదానం కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌డిఒ ఎం.జితేంద్ర పాల్గొని అవసరార్థులకు భోజనం పంపిణీ చేశారు. లయన్ కె.గోపాలకష్ణ, లయన్ వెంకటేశ్వరరావు, అనూప్ జైన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేంద్ర మాట్లాడుతూ అవసరార్థుల కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేపట్టిన ఉచిత మొబైల్ అన్నదాన కార్యక్రమం మూడేళ్ళు పూర్తి చేసుకుని నాలుగో వసంతంలోకి అడుగు పెట్టడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఇది నిరంతరాయంగా జరగాలని ఆకాంక్షించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ కోవిడ్ సంక్షోభ సమయంలోనే లబ్దిదారుల అవసరార్థం కొత్త సేవా కార్యక్రమ రూపుదిద్దుకుందని చెప్పారు. కోవిడ్ తదనంతరం వివిధ వృత్తులు, పనులు చేసుకునేవారికి సరిగా జీత భత్యాలు రాకపోవడం, తగినపని దొరక్కపోవడంతో ఏం చేయాలో, ఎలా బతకాలో తెలియక ఉపాధి కోసం రోడ్లమీద తిరుగుతున్నవారందరికి స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మొబైల్ భోజనం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. సొంత నిధులు, స్నేహితులు, కొందరు దాతల సహకారంతో ఉచిత అన్నదానం నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని వివరించారు. దీని కోసం 12,000 మంది వాలంటీర్లు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ప్రస్తుతం పుష్కర ఘాట్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోజూ 400 మందికి భోజనాలు పెడుతున్నామని రాంబాబు చెప్పారు. .

ఫిజిక్స్‌లో సౌజన్యకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - రాజానగరం



డాక్టరేట్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న విసి

'గ్యాస్ హైడ్రేట్ ఫార్మేషన్ అండర్ సిములేటెడ్ నేచురల్ కండిషన్స్ ఫర్ సస్టైనబుల్ గ్యాస్ స్టోరేజ్' అనే అంశంపై ఫిజిక్స్‌లో కె.సౌజన్య పిహెచ్‌డి చేశారు. యూనివర్సిటీలో పిహెచ్‌డి అధికారిక ప్రకటన పత్రాన్ని విసి కె.పద్మరాజు చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను విసి వెల్లడించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో కె. సౌజన్య పిహెచ్‌డి పూర్తి చేశారని తెలిపారు. పరిశోధన వర్క్‌ను నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్‌జిఆర్ఐ) హైదరా బాద్‌లో నిర్వహించారని, ఎన్‌జిఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ పిఎస్ఆర్.ప్రసాద్ ఇంటర్నల్ గైడ్‌గా, నన్నయ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ కెవి.స్వామి ఎక్స్‌టర్నల్ గైడ్‌గా వ్యవహరించారని చెప్పారు. తన పరిశోధనల ద్వారా గ్యాస్ హైడ్రేట్లు భవిష్యత్తులో శక్తికి మూలమని, మీథేన్ హైడ్రేట్ల అపారమైన రిజర్వాయర్లు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తాయని, భారతదేశం రెండవ అతిపెద్ద హైడ్రేట్ రిజర్వాయర్లను కలిగి ఉందని, వీటిని సరిగ్గా వినియోగించుకుంటే మరో 200 ఏళ్లపాటు ప్రపంచ ఇంధన అవసరాలకు ఇవి ఉపయోగపడతాయనే విషయాలను ప్రస్తావించారని తెలిపారు.

జవాబిదారీతనంతో సేవలు అందించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్పందనకు వచ్చిన అర్జీలను జవాబీతనంతో కూడిన విధంగా సేవలు అందించి పరిష్కరించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలపై 14 మంది తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీరు, రోడ్లు, డ్రయినేజీ, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, సిటి ప్లానర్ జివిఎస్ఎన్.మూర్తి, ఎస్ఇ జి.పాండురంగ రావు తదితరులు పాల్గొన్నారు.

15న దేవాంగ సంఘం వార్షిక సభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం వార్షిక సర్వ జన మహాసభ ఈనెల 15 ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి కళ్యాణ మండపంలో జరుగుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డికె.నాగరాజు, ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆశపు రామలింగేశ్వరరావు, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, ఎపి దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ బీరక సురేంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘీయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సుడిదోమ నివారణకు తూటికాడ

ప్రజాశక్తి - గోకవరం

సుడిదోమ నివారణకు తూటికాడ కషాయంతో పిచికారి చేస్తే నివారణ అవుతుందని ప్రకతి వ్యవసాయ అధికారిని ఐ శివ సోమేశ్వరి తెలిపారు. సోమవారం మండలంలోని రంపఎర్రంపాలెం యూనిట్ పెంటపల్లి గ్రామంలో సుడిదోమ నివారణకు తూటికాడ కషాయాన్ని రైతులతో తయారు చేయించారు. ఖర్చు లేకుండా సుడిదోమ తూటికాడ కషాయంతో నివారించవచ్చని, తూటికాడ ఆకులు 10 కేజీలు, సీతాఫలం ఆకులు 5 కేజీలు, మారేడు ఆకులు 5 కేజీలు, ఆవు మూత్రం 30 లీటర్ల అవసరమని, ఆవు మూత్రాన్ని మరగబెట్టి దానిలో తూటి కాడ ఆకులను మెత్తగా చిన్న ముక్కలుగా తరిగి వాటిని వేసి నాలుగు పొంగులు వచ్చేవరకు మరగబెట్టాలని తెలిపారు. దానిని చల్లార్చిన తర్వాత 15 లీటర్ల నీరులో అరలీటర్ల కషాయం వేసి పిచికారి చేయాలన్నారు.

ఎస్‌డిజిపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

సమాజంలో ఉన్న పేదరికాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంచుకోవాలని ఎంపిడిఒ బి.రాంప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివద్ధి లక్ష్యాలు అనేవి 2030 నాటికి ప్రపంచంలోని బహుముఖ రంగాల్లో పేదరికాన్ని రూపు మాపడానికి ఈ లక్ష్యాలను రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార రాజ్యలక్ష్మి, ఇఒపిఆర్‌డి పంచాయితీ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైస్కూల్లో విద్యార్థి ఎన్నికలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కామరాజుపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.ఈశ్వరిదేవి ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌పిఎల్ ఎన్నికల నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరి దేవి మాట్లాడుతూ విద్యార్థులలో ప్రజాస్వామ్య, భావనలు, ఎన్నికల వ్యవస్థ, నాయకత్వ లక్షణాలు, పిల్లలలో అలవడడం కోసం నమూనా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఎన్నికలలో ఎన్నికైన విద్యార్థుల నాయకుడికి ఉపాధ్యాయులు పెద్దిరెట్ల రాజు, పి రాహుల్ గాంధీ, జె తాతారావు, సువర్ణ రాజు, చక్రధర్, మేరీ మాత, వెంకటేశ్వరరావు అభినందనల తెలిపారు.

జెఎఎస్ కార్యక్రమంలో వైద్య వేవలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని పెరవలి గ్రామ సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ వర్మ, డాక్టర్ మెల్టన్ వైద్య సేవలు అందించారు. బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పంపన అంజిబాబు, గంగోలు జోసెఫ్, శివరామరాజు, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హోటల్‌పై విజిలెన్స్‌ దాడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని మెయిన్‌ రోడ్డులోని శరవణ అయ్యప్ప విజిటేరియన్‌ మీల్స్‌ హోటల్‌పై విజిలెన్స్‌ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. హోటల్లో గృహ వినియోగ గ్యాస్‌ సిలెండర్లను వినియోగిస్తున్నట్లు అందిన సమాచారంతో సోమవారం హోటల్‌ను తనిఖీ చేశారు. గృహ వినియోగ గ్యాస్‌ సిలెండర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్‌ అధికారి కె.కుమార్‌ తెలిపారు. ఐదు గ్యాస్‌ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని, హోటల్‌ నిర్వాహకులు జంగా లవకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ జగనారెడ్డి, జయలక్ష్మి లక్ష్మినారాయణ, హెచ్‌సి జీవానందం, కానిస్టేబుల్‌ లోవకుమార్‌ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి - గోకవరం

కుక్కల దాడిలో వృద్ధుడు గాయాల పాలైన సంఘటన సోమవారం గోకవరంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన మహిపాల తాతీలు అనే వృద్ధుడు గోకవరం విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ వద్దకు కరెంట్‌ బిల్లు కట్టి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో ఆ వృద్ధుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు ఆ వృద్ధుడిని 108 వాహనంలో గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుమార్తెతో గొడవ : తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కన్న కుమార్తెపై అలిగిన తండ్రి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉండ్రాజవరం మండలం వడ్లూరులో చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లి గ్రామ నివాసి వేమెల మంద కాశీ విశ్వనాథ రాజు (49), కుమార్తె దండు విద్యా కవిత మాడిద్దే క్రితం వివాహం కావడంతో వడ్లూరులో భర్త దండు వెంకట బంగారు రాజుతో కాపురం ఉంటోంది. ఈమెకు ఒక సంవత్సర కాలంగా కవితను పుట్టింటికి రమ్మని తండ్రి విశ్వనాథరాజు పిలిపిస్తున్నప్పటికీ ఆమె వెళ్లడం లేదు. ఈ కారణంగానే తనతో మాట్లాడని కూతురుతో ఎలాగైనా కలవాలని ఆదివారం వడ్లూరు వచ్చి ఆమె ఇంటికి వచ్చాడు. ఆమె తండ్రికి సమాధానం చెప్పకపోవడంతోపాటు, పుట్టింటికి రానని తెలపడంతో తండ్రి మనస్థాపానికి గురయ్యాడు. తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతని చుట్టుపక్కల వారు తణుకు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.రామారావు తెలిపారు.

వేమగిరిలో దారి దోపిడీ

ప్రజాశక్తి - కడియం

ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లి వస్తున్న ఇద్దరు వ్యక్తులను అటకాయించి దారి దోపిడీకి పాల్పడిన సంఘటన వేమగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన నాగాబత్తుల దుర్గాప్రసాద్‌, గుత్తుల హేమసాయి తేజ విశాఖపట్నం ఉద్యోగానికి సంబంధించి ఇంటర్వ్యూ ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో దిగారు. రైల్వే స్టేషన్లో ఉన్న తమ వాహనంపై వానపల్లి గ్రామానికి వెళ్తుండగా వేమగిరి గట్టు సమీపానికి వచ్చేటప్పటికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారిని అటకాయించారు. కత్తులతో బెదిరించి వారి వద్ద ఉన్న రూ.4,500, పర్సు లాక్కుని ఎపి 05 సిఎస్‌ 1891 నెంబర్‌ గల యాక్టివ్‌ మోటారు సైకిల్‌పై పారిపోయారు. దీంతో బాధితులు సోమవారం కడియం పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన కడియం సిఐ పిజెఐ తిలక్‌ ఎస్‌ఐ బాలాజీ సుందరరావు, క్రైమ్‌ సిబ్బంది సురేష్‌, గోపాలరావులతో కలిసి మోటార్‌ సైకిల్‌ ఆధారంగా సోమవారం ఉదయం వేమగిరి శివారు రత్నా ప్లాస్టిక్‌ కంపెనీ ప్రక్కన కాశీ స్థలంలో నేరానికి పాల్పడిన వేమగిరి గట్టుకు చెందిన బేరంపూడి మోహన్‌ స్వామి, విప్పర్తి ప్రశాంత్‌ కుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి బైక్‌, సెల్‌ ఫోన్‌ స్వాధీనం పరుచుకున్నారు.

పురుగు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - పెదవలి

ముక్కామలకు చెందిన మట్టా పూర్ణ సాయి వినాయక్‌(18) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడిన సాయి వినాయక బతిక చదివారు. ప్రస్తుతం ప్రయివేటుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడేళ్ల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా ఆ వ్యాధి నుంచి ఉపశమనం కలగడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉండవల్లి గ్రామ పొలంలో కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని ఆసుపత్రికి తరలించారు. సోమవారం అతని ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. సూర్య భగవాన్‌ తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...వంగలపూడి గ్రామానికి చెందిన గంప అప్పన్న(23) ఈ నెల 4న పురుషోత్తపట్నంలో కబడ్డీ క్రీడకు వెళ్లి వచ్చాడు. ఒంటి నొప్పులు ఎక్కువగా ఉన్నాయని కుటుంబ సభ్యులకు చెప్పాడు. మరుసటి రోజు మెడ పట్టిందని సీతానగరం సెలూన్‌ షాపుకు వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకుని వెళ్లి ఆర్‌ఎంపి వైద్యునితో ప్రాథమిక వైద్యం అందించే క్రమంలోనే ఆ యువకుడు కాళ్లు, చేతులు కొట్టుకోవడంతో కుటుంబికులు హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడు అమ్మమ్మ లచ్చిరెడ్డి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు, పోస్టుమార్టంకు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని టిడ్కో వాసుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం




ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలోని టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ జె.సీతారామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ టిడ్కో కాలనీని మున్సిపాలిటీకి అప్పగించామని టిడ్కో అధికారులు చెబుతున్నారని, మున్సిపల్‌ అధికారులు మాత్రం తమకు ఈ కాలనీని అప్పగించలేదని అంటున్నారన్నారని చెప్పారు. ఈ కాలనీలో ఐదు మంచి నీటి బోర్లు ఉన్నప్పటికీ ఒకటి మాత్రమే పని చేస్తోందన్నారు. ఈ బోరు నుంచి వివిధ ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేసే ఆపరేటర్‌ను మున్సిపాలిటీ నియమించలేదన్నారు. దీంతో కాలనీ వాసులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అపార్ట్‌మెంట్లలో వాడకం నీరు ప్రవహించే అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ అక్కడక్కడ పూడుకుపోవడంతో మురుగునీరు ప్రవహించే దారి లేక అపార్ట్మెంట్లు వద్ద మురుగునీరు పేరుకు పోతోంన్నారు. దీంతో అపార్ట్మెంట్లలోకి వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్ళవలసి వస్తోందన్నారు. ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కాలనీలో నివసించే ప్రజలు రేషన్‌ కోసం తాము గతంలో అద్దె ఇళ్లల్లో నివసించిన ప్రాంతాలకు వెళ్లి రేషన్‌ తెచ్చుకోవాల్సి వస్తోందని, వృద్ధులు పింఛను తీసుకోవడానికి కూడా ఎంతో దూరం వెళ్ళవలసి వస్తోందన్నారు. పింఛను, రేషన్‌ ప్రతి నెలా ఈ కాలనీకి వచ్చి అందజేసే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కాలనీలో అక్కడక్కడా మాత్రమే వీధిలైట్లు వెలుగుతున్నాయని, కాలనీలో తుప్పలు, డొంకలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. చీకటి పడితే పాములు సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు రాత్రి సమయంలో కాలనీలో తిరగడానికి భయపడుతున్నారన్నారు. ప్రతిరోజు మున్సిపాలిటీ నుండి ఈ కాలనీలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు, సిబ్బంది రాకపోవడంతో కాలనీవాసులు ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవలసి వస్తోందన్నారు. ప్రతిరోజు ఈ కాలనీ నుంచి చెత్త సేకరణకు సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడిగట్ల సత్తిబాబు, సిరపరపు శ్రీనివాస్‌, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి కృష్ణ, చల్లా విశ్వనాథం, కాలనీవాసులు బర్ల శ్రీను, తాతపూడి శ్రీనివాస్‌, చింతల బలరాం, కె.దుర్గాప్రసాద్‌, కందికొండ శ్రీదేవి, మండ పద్మావతి, గండి శివాని, ఉరిటి చంద్ర, కొమరి పార్వతి, నమ్మి నూకరత్నం, స్వాతి, లక్ష్మి, భవాని, రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువపై ఆక్రమణ తొలగించాలని వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు పక్షుల పుంత (బాబా జీవన్‌ నగర్‌)ను ఆనుకుని ఉన్న పంట కాలువ బోధిని ఒక రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి ఆక్రమించాడని ఆక్రమణలు తొలగించాలని సిపిఎం మండల కన్వీనర్‌ టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి తమ పంట బోదెను ఆక్రమించి గ్రావెల్‌తో నింపేశారని గ్రామస్తులు విలేకరులకు తెలిపారు. దీనివల్ల పూర్వం నుంచి ఉన్న పంట బోధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ రవితేజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుందరపల్లి సత్యనారాయణ, మందనక్క తణుకు రాజు, విప్పర్తి శ్రీనివాసరావు గోడి భాస్కర్‌ రావు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గృహ ప్రవేశాలకు సిఎం జగన్‌ రాక

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్‌


సిద్ధమైన సభా వేదిక

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహనరెడ్డి సామర్లకోట పర్యటన ఖరారైంది. ఈ నెల 12వ తేదీన ఆయన సామర్లకోటకు వస్తున్నట్లు టూర్‌ షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసినట్లు సోమవారం రాష్ట్ర హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దవులూరి దొరబాబు తెలిపారు.

ఈ నెల 12వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్లో పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దాపురం రోడ్లోని 13వ వార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ వద్దకు ముఖ్యమంత్రి జగన్‌ చేరుకుంటారు. అనంతరం అక్కడ 15 నిమిషాల పాటు ఆయన ప్రజలతో గడిపి వారి సమస్యలను వింటారు. అనంతరం ఇటిసి లేఔట్‌లోని జగనన్న కాలనీకి ప్రత్యేక బస్సులో చేరుకుంటారు. అక్కడ లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. ఈ సందర్భంగా సామూహిక గహప్రవేశాలను ఆయన చేపట్టి ఫోటో ప్రదర్శనను తిలకిస్తారు. కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వైయస్‌ రాజశేఖర్‌ రెడ్డి కాంస్య విగ్రహాన్ని జగన్‌ ఆవిష్కరిస్తారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అనంతరం లబ్ధిదారులతో సిఎం ముఖాముఖి ఉంటుంది. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం తరువారం సిఎం జగన్‌ తిరిగి హెలికాప్టర్లో తాడేపల్లికి బయల్దేరి వెళతారు.

నేటి యువతకు చేగువేరా ఆదర్శం

ప్రజాశక్తి -కాకినాడ

చేగువేరా వంటి విప్లవకారుని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర సెక్రెటరీ వాసుదేవ్‌ అధ్యక్షతన చేగువేరా 56వ వర్ధంతిని సంక్షేమ బాలుర హాస్టల్లో సోమవారం నిర్వహించరాఉ. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు చేగువేరా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సూరిబాబు మాట్లాడుతూ చేగువేరా హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేశారన్నారు. పేదరికంలో ఉన్న ప్రజలకు, విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యం అందచేయాలని చేగువేరా యుక్త వయస్సులో నుంచే ఉద్యమ పటిమతో సమాజంలో జరుగుతున్న అణిచివేతను ఎండగట్టి, ప్రజలను చైతన్య పరిచారన్నారు. చేగువేరా మంచివైద్యుడు, రచయిత, మేధావి అని అర్జెంటీనాలో పుట్టి, క్యూబా విప్లవోద్యమంలో పాల్గొరన్నారని కొనియాడారు.


చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్‌

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు పలు రకాల జ్వరాలతో బాధ పడుతున్నందున పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్‌ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మానవ హక్కుల సంఘం నాయకులు మున్సిపల్‌ కమిషనర్‌ జె.రామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నూతలపాటి అప్పలకొండ, ఎండి వలీ బాషా దోమల సమస్యపై విన్నవించారు. డ్రైన్లలో పూడికలు పేరుకుపోయి ఉండడంతో దోమల అభివద్ధి చెందుతున్నాయన్నారు. దామకాటుకు గురై అనేకమంది ప్రజలు డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, విష జ్వరాల వంటి బలహీనతలకు గురై ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రైవేట్‌ ఆస్పత్రిలోనూ చికిత్స పొందుతున్నారన్నారు. దోమల బాధితులు ప్రతి ఇంటా ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి వార్డుల్లో, మురికి కాలువల్లో దోమల నివారణకు మందులను పిచికారీ చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కమిషనర్‌కు విన్నవించారు. దానికి కమిషనర్‌ వివరణ ఇస్తూ దోమల సమస్యపై తక్షణమే స్పందించనున్నట్లు హామీ ఇచ్చారు.


వినతిపత్రం అందిస్తున్న మానవహక్కుల సంఘం నాయకులు

భూములను ఆన్‌లైన్‌ చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎస్‌సి కార్పొరేషన్‌ ద్వారా తమకు ఇచ్చిన భూములను ఆన్‌లైన్‌ చేయాలని దళిత ఆక్వా లబ్ధిదారులు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయం వద్ద లబ్ధిదారులు విలేకరులతో మాట్లాడారు. దళితుల లబ్ధిదారులు దిమ్మల జనార్ధన్‌, ద్రోణం సిద్ధార్థ కుమార్‌, యండమూరి సత్తిబాబు, ఈర్ల చిన్ననారాయణమూర్తి, పులిదిండి ప్రభావతి, మందపల్లి వెంకటస్వామి, యండమూరి బేతాళుడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి కార్పొరేషన్‌ ద్వారా 1988లో 10 మందికి, 1996లో 10 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఎకరం చొప్పున చేపలు, రొయ్యలు పెంచుకోవడానికి చెరువులు కేటాయించారని తెలిపారు. వాటిని నేటికీ ఆన్‌లైన్‌ చేయలేదని తెలిపారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు నిలిచారు.


భూములను ఆన్లైన్‌ చేయాలని కోరుతున్న దళిత లబ్ధిదారులు


టాపర్స్‌తో ఉపాధ్యాయులు, సిబ్బంది

సెల్ఫీ విత్‌ టాపర్స్‌తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్‌

విద్యార్థుల్లో పరీక్ష లంటే భయం పోగొట్టి ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి ప్రభుత్వం సెల్ఫీ విత్‌ టాపర్స్‌కార్యక్రమం చేపట్టినట్టు ఆర్‌జెడి రాజు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక బచ్చు ఫౌండేషన్‌ మున్సిపల్‌ హైస్కూల్‌ విద్యార్థులతో ఆయన ఫోటో దిగారు. ఇటీవల జరిగిన ఎఫ్‌ఎ-2 పరీక్షల వాల్యూయేషన్‌ పరిశీలించారు. ఈ విధానంలో ప్రత్యేకతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుల్లయ్య, హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ, జి.గోవింద్‌, కెవివి.సత్యనారాయణ, ఎవ్‌వి.కుమారి, ఎ.శ్రీవల్లి పాల్గొన్నారు.

నేడు దిశ జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా అభివద్ధి సమన్వయం మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ)సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ ఛైర్మన్‌, ఎంపి మార్గాని భరత్‌ రామ్‌, హోంమంత్రి డాక్టర్‌ తానేటి వనిత, జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ కె. మాధవీలత, ఉమ్మడి గోదావరి జిల్లా పరిషత్‌ ఛైర్మన్లు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

మానసిక విద్యార్థులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరులోని శాంతివర్ధన మానసిక వికలాంగ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, మున్సిపల్‌ కౌన్సిలర్‌ నేతల హరిబాబు దంపతులు పండ్లు, ఆహారం, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓమ్‌సాయి భార్గవి, కమల రాజ్‌, ప్రీతి, మౌనిక పాల్గొన్నారు.

ఎస్‌కెఆర్‌ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌ మేళాను కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. కంప్యూటర్‌ ఆపరేటర్స్‌, సూపర్వైజర్స్‌, అకౌంటెంట్‌ ఉద్యోగాల కొరకు జరిగిన జాబ్‌ మేళాలో విద్యా సంవత్సరంలో డిగ్రీ పొందిన 50కి పైగా విద్యార్థినులు పాల్గొన్నారు. టెక్నోటాక్స్‌, ముత్తూట్‌ ఫైనాన్స్‌, నవత ట్రాన్స్‌పోర్ట్‌, మోటోకార్ప్‌ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బి.అనూరాధ, అకాడమిక్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ఎమ్‌.సునీత పాల్గొన్నారు.

చంద్రకుమార్‌కు క్రియేటివ్‌ ఆర్టిస్ట్‌ అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్‌

క్రియేటివ్‌ హార్ట్స్‌ అకాడెమీ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన వందే వేద భారతం చిత్ర కళా పోటీల్లో పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌ వేసిన రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు చిత్రానికి క్రియేటివ్‌ ఆర్టిస్ట్‌ అవార్డ్‌ను అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 360 మంది చిత్రకారులు ఇందులో పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన ప్రముఖ చిత్రకారులు ఎం.రాంబాబు, ఇంటర్నేషనల్‌ ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌ చైర్మన్‌ ఎన్‌.మనువిహార్‌ తదితరుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

మాజీ మంత్రి జక్కంపూడి నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నల్లవంతెన వద్ద జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జక్కంపూడి వర్ధంతి సందర్భంగా పలువురు మాట్లడారు. ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మద్దింశెట్టి ప్రసాద్‌, కల్వకోలను ఉమ, నవుండ్రు రమేష్‌, దాసం రాంబాబు, సుంకం స్వామి, రాజబాబు, సలాది గుప్తేశ్వరావు, మామిడిపల్లి రాము, కోటిపల్లి బాపన్న, జక్కంపూడి సత్యనారాయణ, కిరణ్‌, పెచ్చెటి నాని, కె.చిన్న పాల్గొన్నారు.

మామిడికుదురు : అప్పనపల్లిలో తులా గోపాలకష్ణ ఆధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి సర్పంచ్‌ గెడ్డం మహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు బొంతు నీలిమ పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ పిచిక శివనాగసత్యనారాయణ, ఉపసర్పంచ్‌ మేడేపల్లి చిన్న, డాక్టర్‌ కంకిపాటి వెంకటేశ్వరరావు, కంకిపాటి హిమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి 'అమ్మ' సాయం

ప్రజాశక్తి - మండపేట

చిన్నారి వైద్యం కోసం అమ్మ ఫౌండేషన్‌ రూ. 35 వేల ఆర్థిక సాయం అందించింది. రాజవొమ్మంగి మండలం చికిలింతకు చెందిన జర్రా రిషివర్ధన్‌ నిమజ్జన వేడుకల్లో గాయాల పాలవడంతో తల్లి దండ్రులు బాలుడిని కాపాడు కోవడానికి కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు ఇమిడిసెట్టి నాగభూషణం దాతలు సహకారంతో రూ.35 వేలను సేకరించి పట్టణ ఎస్‌ఐ చిన్నారావు చేతుల మీదుగా బాలుడు తల్లిదండ్రులకు అందజేశారు.

అభివృద్ధి, సుస్థిర లక్ష్యాల ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సుస్థిర లక్ష్యాలు, శాఖల వారీ లక్ష్యాలు, ఏర్పాటుపై కపిలేశ్వరపురం మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్‌ కె.సూర్యారావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. మండల ప్రత్యేక అధికారి ఎ.శాంతి, ఎస్‌ఐ బి.చంటి, తదితరులు హాజరయ్యారు.

యానాం వార్తలు


శిథిలమైన రెయిలింగ్‌

శ్మశాన వాటికలో సదుపాయాల కరువు

ప్రజాశక్తి - యానాం

స్థానిక టైడల్‌ లాకు దిగువననున్న హిందూ శ్మశానవాటికలో సదుపాయాలు లేకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భౌతికకాయాన్ని ఉంచి దహనం చేసే సిమెంట్‌ బెడ్‌ చుట్టూ ఉండే రెయిలింగ్‌ శిథిలమై అంత్యక్రియలకు ఆటంకం ఏర్పడుతుందని, దీనిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదంటున్నారు. దీనికి తోడు శ్మశానవాటికకు వాచ్‌మెన్‌ లేకపోవడంతో గంజాయి బ్యాచ్‌ తమ అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారని చుట్టుపక్కల వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, స్మశానంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం : కె.గంగవరం మండలం కుందూరు గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె సుంకర వీర వెంకటలక్ష్మి ఈ నెల 5న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. నాటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులను వాకాబు చేసింది. ఎక్కడా ఆమె ఆచూకి తెలియకపోవడంతో ఆమె తల్లి ఎర్రంశెట్టి వెంకటరమణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కె.గంగవరం ఎస్‌ఐ జానీ భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.